# మిత్రత్రయంతనే రాజా చిట్టి రాజుల ఈశతరం వెట్టి



'చిన్న'

"రాణీ!"

ఆ పిలుపు అతని నోట్లోంచి వచ్చి నట్టు లేదు. ప్రపంచంలో ప్రతి వస్తువు నుంచి, ప్రతి పువ్వునుంచి, పిట్టనుంచి, గుట్టనుంచి — ఒకటేమిటి, ఈ రేడు లోకాల్లో ఈ పేరే కోరిపిలుకు ప్రతిధ్వనిలా అతని నోటమ్మట —కాదు కాదు, గుండె ల్లోంచి, అంతరంగం లోంచి వచ్చిన ట్టనిపించింది.

"రాణీ!"

మళ్లీ పిలిచాడు.

"ఊఁ!" అంది తన్మయత్వంతో.

"ఇటువైపు చూడు, రాణీ" అంటూ మఖుకం ఎత్తి తన వైపు తిప్పుకున్నాడు.

"కళ్లు మూసినా, తెరిచినా నీ రూపే కనిపిస్తుంటే వేరే నీ కళ్ల వైపు చూడాలా, రాజా!" అంది అరమోడ్పు కన్నులతో. . .

"ఒరే! ఒరే! అన్యాయం రోయ్! అసలు మనలోనే ఇద్దరు రాజులు. ఇంక మనం రాసే కథలో హీరోపేరుకూడా రాజైతే చదివేవాళ్లు చదవాలా? చావాలా?"

"చదివేవాడు చేతకాని వాడైతే అన్నీ చచ్చుసందేహాలే. నేను రాజాని, నువ్వు రాజువి. మనిద్దరం మన ముగ్గురం ఉన్నప్పుడే వస్తాం. ఈ కథలో రాజుగ్గాడు రాణీ పక్కనే ఎప్పుడూ ఉంటాడు. మరి చదివేవాడికి కన్ఫ్యూజన్ ఎక్కడుంటుంది?"

"ఒరేయ్, రాజా! అన్యాయందా! కథని ఎంత నువ్వే మొదలు పెడితే మటుకు— నీ పేరే పెట్టాలా?"

"చిట్టీ! అన్నిటికీ ఇలా అభ్యంతరాలే అయితే, ఈ నవల ఈ ఉగాది పోటీకి కాదుకదా, ఈ జన్మలోనే పూర్తికాదు. హియర్ మి!" బతిమాలుతున్నట్టే అన్నాడు.

"రాజా! కాఫీ ఇప్పించాల్రా. నువ్వు చదవబోయేది చిన్న కథా కాదూ, చిన్న గేయమూ కాదు. అన్ని కాగితాలు వినద్దూ? ఓపిక ఉండద్దూ! ప్లీజ్, కమాన్" అంటూ హోటల్‌వైపు దారి తీశాడు రాజు.

"రాజా! కథనినేనుచదువుకుంటాన్రా. ఒకళ్లు చదివితే నాకు బోర్‌గా ఉంటుంది— ఆ పేపర్స్ ఇటియ్యి."

"ఒరేయ్, చిట్టీ! ఇన్ని పేజీలు నీ ఒక్కడి చేతిలోనే ఎడ్లబండిలా సాగితే, ఇంకా వాడుకూడా చదవాలా? నేను చదివి వినిపిస్తే కనీసం నలభై నిమిషాల్లో అయిపోతుంది. అయినా, చిట్టీ, వారం వారం రచయితసంఘం అంటూ ఉడాయిస్తుంటావు — అక్కడ బోర్ కొట్టదా?"

"ఎందుకొట్టదూ? ఎవరో నీ లాటి ఫ్రెండ్ తగిలి నాలుగు కాఫీ చుక్కలతో నాలిక్కాస్త తడుపుతారని— అట్నించి ఏ పిక్చర్‌కైనా తీసుకెళతారని— లేకపోతే! హారిబుల్! అన్ని కథలు వినడమే!"

"ప్లీజ్! వినరా! నేనుకూడా కాఫీ నీళ్లు—నీళ్లు కాదు స్ట్రాంగ్ బ్రూ పోయిస్తున్నాగా? కావలిస్తే నీ పెట్ జ్యోతిలక్ష్మి సినిమాకి తీసుకెళతాగా? కాస్త శ్రద్ధగా వినరా! అయినా, నీ టర్న్ వచ్చినప్పుడు నేను విననా ఏమిటి? లిజన్ టు మి!"

"ఒరేయ్! కాఫీ ఒక్కటే తీసుకుంటే ఇట్టే అయిపోతుంది. ఇంకా కథ వినడానికి చాలా టైమ్ మిగిలిపోతుంది— కాబట్టి. . ."

"టిఫిన్ ఇప్పించమంటావు? అంతేనా? లాభం లేదు, బ్రదర్. టిఫిన్ తిన్నా కథ వినడానికి టైమ్ మిగిలిపోతుంది కాబట్టి ఒక ప్లేటు మిక్చర్ తెప్పిస్తాను — ఒకొక్కళ్లు తాపీగా, ఒక్కొక్క బూంది తింటూ కథ వినండి."

"ఘోరం, గురూ! మరీ ఒక్కొక్కటేమిటి? కనీసం ఒక్కొక్కటి. నీ కథ చదవడం పూర్తయినవరకు వింటాంగా!"

"మరి కూల్‌గా వింటారా?"

"ఓ. . . ఓ. . ."

"అవును గానీ, మనం ముగ్గురం ఇలా పోటాపోటీ మాట్లాడేసుకుంటే చదివేవాడికి ఎవరెవరు మాట్లాడుతున్నది ఎలా తెలుస్తుందంటావు?"

"ఆఁ! గాడిదగుడ్డు! వాక్యం అంటే కర్త కర్మ క్రియ ఉండాలా? గడియ గడియకీ వాడన్నాడు, వీడన్నాడు, అదంది, ఇదంది అంటూ రాస్తుండాలా? ఇది రాకెట్ యుగం! రాసేవాడికి ఓపిక ఉండదు. చదివేవాడికి తీరిక ఉండదు. తమరు వాక్యవిన్యాసంలో కూర్చుంటే షార్టు స్టోరీకూడా పెద్ద నవలంత అయి కూర్చుంటుంది. కాబట్టే మనం రాయబోయే కథ— సారీ, రాయబోయే నవల ఎలా ఉండాలంటే రాకెట్టుకన్నా వేగంగా ఉండాలి. ఈ బూందీకన్నా గట్టిగా ఉండాలి. ఛ! ఛ! నిన్నటిదో, మొన్నటిదో పెట్టేడు వెధవ! పోనీలే, ఇదీ మంచిదే. ఈ కథైన వరకూ చచ్చి నట్టు తింటాం. కానుకోండి. చదువుతున్నా! ఒరేయ్, మరి నోరు కదపక బూంది ఎంత పాతదైతే మటుకు అంత శబ్దం చేస్తూ తినాలా? ఒరేయ్, చిట్టీ! తింటూ తింటూ అలా తొట్టు తెయ్యక బీ సైలెంట్! ఎండ్ లెండీ మీ యువర్ ఇయర్స్!"

రాజా తన కథని చదవడం ఆరంభించాడు— కాదు కాదు, ఇందాక చదివిన దాన్ని కంటిన్యూ చేస్తున్నాడు.

చిట్టి, రాజులు వాళ్ల నాలుగు చెవులూ అప్పగించేశారు. ఎలాగైనా, ఉమ్మడిగా వ్రాయాలనుకున్న గొలుసు నవల కదా, ముగ్గురిలోనూ ఆ మాత్రం సర్దుబాటు ఉండకపోతే ఎలా?

"కళ్లు మూసినా, తెరిచినా అంతటా నీ రూపే. . ."

"అబ్బా, ఇందా కలా వాక్యం చదివేవా!

"చదివితే చదివాను. మళ్ళీ విను— అంతే."

"కళ్ళు మూసినా తెరిచినా అంతటా నీ రూపే కనిపిస్తుంటే వేరే నీ కళ్ళ వైపు చూడాలా, రాజా!" అంది అరమోడ్పు కన్నులో!

"రాణీ! [illegible] ముద్దుబిడ్డవు. [illegible] రాణీవి. అలాటిది ఈ నామమాత్రపు రాజుని ఎలా ప్రేమించావు? ఎలా మన సిచ్చావు? కోరి కళ్యాణం చేసుకుంటే కడగళ్ళ కాపరం అయిపోతుందేమో?"...

"ఒరేయ్, రాజా! నువ్వెంత తెలుగు భాషాప్రవీణ పాసైన వాడివైనా, వాక్యాలు అంతలా దొర్లిపోతుంటే పాఠకుల ప్రాణాలు దామంటాయి!"

"ఒరేయ్! కథ చదువుతున్నప్పుడు మాట్లాడించద్దనలేదూ! ఈ కథలో రాజా, నా పేరు రాజా. పాఠకులు తడబడరూ? అందుకే కథ 'ఫ్లో'ని ఆపకూడదు. అయినా, పాఠకు లందరూ నీ లాటి చచ్చుపీనుగులే ఉండరు. తిన్నగా విను."

"కోరి కళ్యాణం చేసుకుంటే ఓహ్! చదివేశాను కదూ ఈ లైను. . ."

తటాలున అతని నోటిని చేత్తో మూసింది.

"అంత మాట అనకు రాజా! నేను కలవారి బిడ్డనే, కాదనను. కానీ, మనసు? ఈ మనసుకి పేద, గొప్ప భేదం లేదు. నా మనసుకి నచ్చావు! నా హృదయాన్ని నువ్వు దోచావు. కులం, మతం, ధనం గినం ఇవేవీ మనకి అడ్డురావు. పెద్ద వాళ్ళు కాదంటే పాచి పనైనా చేసుకుని మనం బతికిపోగలం. . ."

"రాణీ! నిన్ను పాచిపని చేయనిస్తానా?" కౌగిలిలోనున్న రాణిని మరింత గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. "నా రాణీ! నన్ను నమ్ముకుని నాతో రాబోతున్న దానివి, పాచిపని చెయ్య డమా? నా హృదయ సామ్రాజ్యానికి రాణివి చేస్తా! నా మనోమందిరంలో వలపులదేవతగా ప్రతిష్ఠ చేస్తా. ఇంకా... ఇంకా. . . మరి చెప్పలేను, రాణీ!"

నిజమే, రాణిని అంతమటుకే చెయ్య గలడు. అలాటి ప్రేమిక హృదయానికి వాస్తవం ఎలా తెలుస్తుంది? రాజాకి ఆ సమయంలో తాను నిరుద్యోగినని, తన వలపుల రాణిని హృదయంలో తప్ప కూర్చోపెట్టడానికి సరిఅయిన చోటైనా లేదని ఎలా గుర్తొస్తుంది? వాళ్ళ దయ మీద, వీళ్ళ దయమీద ఆధారపడి, పరుల పంచలో తల దాచుకుంటున్న రాజా, రాణీ వలపులరాజునే అనుకుంటు న్నాడు గాని, దరిద్ర నారాయణులకు మహారాజు అనుకోవటం లేదు.

కొంచెం మంచినీళ్ళు తాగాడు రాజా. కథ రసపట్టులోకి రాకపోయినా, వినడానికి విసుగనిపించలేదు. బహుశా రాజా చదవ డంలో బ్యూటీ ఉందో, లేక తింటున్న బజ్జీ బాగుందో (తినగ తినగ వేము [illegible]) [illegible], రాజా కిక్కురుమనకుండా తింటూ వింటున్నారు.

రాజా సిగరెట్టు వెలిగించుకుని గట్టిగా రెండు దమ్ములు లాగి మళ్ళీ మొదలుపెట్టాడు. . .


"అక్కడ కా సీనయిపోయింది. రెండో సీనన్నమాట. అరవేసిన రాణీ చీరలని మూసె చుక్కైనా లేదు. నా రాణీ! నా వల్ల నీ కెంత బాధ!" అంటూ ఆమె రెండు చేతుల్ని ముద్దు పెట్టుకున్నాడు.

అతని పెదవిమీద సుతారంగా చిటిక వేసింది రాణి. "ఇంతకన్న మించిన మందు ఇంకేమిటి ఉంది, రాజా" అంది ప్రేమగా చూస్తూ. . .

"ఏమ్రోయ్! నిజం చెప్పండి— ఈ సీను సినిమాటిక్‌గా లేదూ? శోభన్ బాబూ, వాణిశ్రీ వేస్తే మరీ రమ్యంగా ఉంటుంది కదూ?"

"హా! ఏడ్చాడు! వాడేం చెయ్య గలడు? కృష్ణ వెయ్యాలి."

"ఆఁ. . కృష్ణంటే గుర్తొచ్చింది— ఈ రోజే 'మొనగాడొస్తున్నాడు జాగ్రత్త' రిలీజ. ఒక్క కృష్ణే కాదు, జ్యోతిలక్ష్మి



ఒంటరి

చిత్రం—దత్తు. జి. వసికుక్తేరి కారు

మదత పెడుతున్నాడు రాజా. పాచి పనుల కెళ్ళిన రాణీ ఇంకా రాలేదు. పొద్దుటినుండీ గుక్కెడు కాఫీనీళ్ళైనా పడకపోయేసరికి కడుపులో ఎలుకలు రామభజన చేస్తున్నాయి. దివాణంలో మహారాణిలా బతికింది. తనని కట్టు కోవడంవల్లనే కదా ఈ కష్టాలు. ఈ సారి చాలా జాలి వేసింది రాణిమీద.

సిల్వరు కారియరులో ఇంత చారూ, అన్నం కలిపి తీసుకొచ్చింది రాణి.

అన్నం చూడగానే ఆత్మారాముడు 'ఉప్ప్'మని లేవబోయాడు. కానీ, రాజా మనసులో ఉండే దయనీయమైన ఆత్మ ఆ రాముణ్ణి మందలించింది.

"రాణీ! నా వల్లనే కదా నీకు ఈ కష్టాలు? చూడు, సుకుమారమైన నీ చేతులు ఎలా కందిపోయాయో! మందు రాద్దామంటే మందు కాదు కదా, మంది కూడా ఉందిరోయ్! ఒరేయ్, రేయ్! సినిమా కెళదాంరా?"

"అయితే, ఇక్కడికే కథ చదవడం ఆపమంటావా?" అన్నాడు రాజాచికాకుగా.

"రేపు ఇదే హోటల్లో సరిగ్గా ఇదే సమయంలో ఇలాగే విందాంగా."

"అన్యాయం రోయ్! ఈ హోటల్ బిల్లు, సినిమా టిక్కెట్లు, రేపటి హోటల్ బిల్లు— మొత్తం ఓ పెద్ద నోటు. నా జేబు నీరసపడిపోతుందిరా!"

"పోవోయ్ బడాయి— మనం రాయ బోయే కథ— సారీ — అదే నవలకి ఉగాది నవలల పోటీలో ఎట్లీస్ట్ ఫర్స్ట్ ప్రైజు వచ్చినా రెండు వేల రెండు వందలు. మూడు పెట్లే భాగిస్తే. . . చెప్పరా మేథమాటిషియన్!"

"మూడు పెట్లే భాగిస్తేనా?" బుర్ర గోక్కుంటూ, "సరిగ్గా తెగదురా— మూడేళ్ళ ఇరవై ఒక్కటి. ఒకటి మిగిలితే... అబ్బా, ఏడువందల చిల్లర రా!"

"పోనీ, ఆ చిల్లర నలా ఉంచు— ఏడు వందలు! మాటలా! ఇలాటి సినిమాలు మరో వంద చూసినా ఫరవాలేదు."

"కలలోకూడా బంగారం గ్లాసుతో పరమాన్నం అక్కర్లేదురా మాకు— మట్టికుండలో మంచినీళ్ళే తాగుతా మంటారు. వెరీ ఛీప్ టేస్ట్! ఫస్టు ప్రైజ్ వస్తుందని ఎందు కనుకో కూడదూ?"

"ఫస్టుప్రైజుకి రెమ్యూనరేష నెంతరా?"

"అయిదు వేల అయిదు వందలు."

"అంటే మనిషికి. . . ఒక వెయ్యా, ఎనిమిది వందల. . . ఎంతోలే."

"నిజంగా ఫస్టుప్రైజ్ రావాలేగాని, నే నేం చేస్తానంటే చక్కగా ఇండియా అంతా తిరిగొస్తాను."

"నీ కేం, నాయనా, ఇండియా ఏం ఖర్మ, ఇంగ్లండేనా వెళ్ళి వస్తావు. నా మటుకు నేను ఓ చిన్న ఉద్యోగం కొను క్కుంటాను సుమీ!"

"ఒరే! ఈ ఇండియాలో ఆఫ్టరాల్ పద్దెనిమిది వందలకి ఉద్యోగం వస్తుం దట్రా?"

"అరెరె. . . పావు తక్కువ అరు! తొందరగా వెళ్ళకపోతే చచ్చాం టైటిల్సు మిస్ అయిపోతాం. గెటప్, గెటప్" అంటూ తొందర పెట్టాడు కప్పులో ఉన్న ఆఖరి డ్రాపునికూడా సిప్ చేస్తూ.

* * *

"కొండామల్లె కన్నెపిల్లో బుల్లోడా నీ కండా చూసీ, కన్నేసిందో చిన్నోడా!"

"ఏయ్, మిస్టర్! ఇది సినిమాహాలను కున్నావా? స్త్రీగొండనుకున్నావా? ఏమి టలా కుర్రిమోంచి అంతలా గెంతుతావు? పక్కవాడు చూడాలా? చావాలా?" అన్న పక్కవాడి గదమాయింపుతో కుర్చీలో సరిగా కూర్చున్నాడు రాజా—"సారీ అండీ" అని, ఓ చిన్న క్షమాపణ పారేస్తూ.

"ఒరే, రాజా! మన కథలో ఓ క్లబ్ డాన్సుండకపోతే ఎలారా! ఒక వేళ మన కథ సినిమా తీస్తే వాళ్ళేలాగా కల్పి స్తారు. కాబట్టి మనం ఓ క్లబ్ డాన్సు కూడా కథలో ఇరికిస్తే?"

"రాజా! విజై లలితా, జ్యోతిలక్ష్మి లేకపోతేగాని, నీకు సినిమా దాణించదురా! మనం రాయబోయేది పక్కా సాంఘిక నవల. నువ్వు క్లబ్బులు, తిప్పలు అంటే ఎలా?" చిరాకుపడ్డాడు చిట్టి.

"నీ కెందుకు? కథ నా టేస్టుకి రానీ, నే నెంత బ్యూటిఫుల్‌గా మారు స్తానో!"

"ఏమండీ, ఈ సినిమా నే నిదే మొదటిసారి చూడ్డం. మీరిలా గొడవ పెడుతుంటే ఎలా చూడగలం చెప్పండి?" వెనక సీట్లో ఎవరిదో చిరాగ్గా, విసుక్కుంటున్నట్టుగా, అర్థిస్తున్నట్టుగా గొంతు వినబడింది.

కిక్కురుమనకుండా సినిమా సాంతం మహా కష్టంగా చూశారు. నోరు మెదప కుండా సినిమా చూడ్డం కష్టమే మరి.

. .

"రాణీ, నువ్వలా పనిలోకి వెళ్ళగానే, ఇలా మీ నాన్నగారు వచ్చారు. నన్నెన్ని మాటలన్నారని! పెళ్ళాంకి పట్టెడన్నం పెట్టలేని దరిద్రుణ్ణోట. నన్ను కట్టుకో బట్టే నీకీ కష్టాలుట."

"రాజా! నా మొగుణ్ణి గౌరవించని వాళ్ళు నా ఇంటిగుమ్మం ఎక్కడానికి వీల్లేదు. తండ్రైతే మటుకు! గెటవుట్ అనలేకపోయ్యావా! అర్ధాకలితో ఉన్నా ఆత్మ తృప్తి ఉంటే చాలదూ? రాజా, ఈ రోజు నేను పని చేస్తున్న ఇంటి యజమానురాలు కుట్టుమెషీను కొన్నారు. నాకు కుట్టు నేర్పుతున్నారు. బాగా నేర్చుకున్న తరవాత మనం కూడా ఓ మెషినెలాగైనా కొనుక్కుందామండీ!"

"రాణీ! ఎంత టనమర్ధుణ్ణి కట్టుకున్నావు, రాణీ!" అంటూ మంచంకోడుకి తల మరీ కొట్టుకుంటూ ఏడ్చాడు రాజా.

"రాజా! ఏమిటిది? ఛీఛీ! ఆడపిల్లలా ఏమిటీ ఏడుపు? తల ఎంత కమిలిపోయిందో చూడు? అయ్యయ్యో! ఎంత బొప్పి కట్టిందో! ఈ మందు కన్నా ఏ మందు పెట్టగలం చెప్పూ?" అంటూ నుదుటిమీద ముద్దు పెట్టుకుంది రాణి. . .

"ఒరేయ్, రాజా! మన సినిమాల్లో ఇంకో ముద్దులు ప్రవేశపెట్టలేదురా. కొంచెం సినిమాటిక్‌గా రాద్దాం. ఎందుకేనా మంచిది."

"అయినా, రాజా, చీదరికంలో రొమాన్సుని ఎంతవరకు లాగగలవురా? ఓ హనీమూనా, విహారయాత్రా? ఏ గుడ్డూ లేకుండా చచ్చుపీనుగుల్లా పూరిగుడిసెల్లో ప్రేమికులు ఎంతకని ప్రేమించుకోగలరురా?"

"ఏం ఎందుకు ప్రేమించ కూడదూ! 'ప్రేమ యాత్రలకు కొడైకెనాలు, కాశ్మీరాలూ ఏలనో' అంటూ పింగళి నాడో చెప్పారు."

"ఊహూఁ! ధనిక జీవితంలోనే రొమాన్సు బాగుంటుంది. నా పెన్నుకి వాసి వాళ్ళని గొప్పవాళ్ళుగా చేసి పారేస్తా!"

"మధ్యలో మాట్లాడించకండ్రా, బాబా! ఎంతవరకు చదివాను? నసన ... నె ... నె నె ..."



గడియ...

ఫోటో—కె. ఎ. వాసుదేవ (హుబ్లి)

"ఒరేయ్! నువ్వు మరోసారి చదివినా భ్యంతరా ల్లేవు గానీ, ఈ నసుగుడేంట్రా?"

రాజా, రాణీల జీవితం మూడు పువ్వులకి ఆరు వసంతాలుగా గడుస్తోంది. మనఃతృప్తి ఎంతటివారికైనా క్లేశాన్ని పోగొడుతుంది.

అద్దె ఇల్లైనా, ఇంటి చుట్టూ తోట లాటిది (విజయా గార్డెన్స్ అంత) వేసుకున్నారు. కాయగూరలు పండించుకుంటున్నారు. గంపల్లోకెత్తి, బజారు పంపించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఒక రోజు రాణీ గంప నిండా కూరలు నింపి, గంపని రాజా నెత్తిమీద పెట్టబోయింది. వెంటనే తూలి పడిపోయింది. రెండు చేతులతోనూ పొదివి పట్టుకున్నాడు రాజా.

"రాణీ! ఏమిటయింది? ఒంట్లో బాగాలేదా?" అన్నాడు ఆత్రతతో.

సిగ్గుపడుతూ అతని చెవిలో చెప్పింది. (చుట్టుపక్కల ఎవ్వరూ లేరు గదా, మొగుడితో గర్భవతినని చెప్పడానికి సిగ్గెందుకూ?)

రెండు చేతులతోనూ ఆమెని ఎత్తి గిఱ్ఱని తిప్పాడు. "నేను నాన్నను కాబోతున్నానోచ్!" అని కేకలు వేశాడు. (అసలు భార్య 'పీరీడ్స్' గురించి తెలుసుకోలేనటువంటి భర్తలు ఉంటారా అని! భార్య గర్భవతి అని ఒకరు చెప్పిన వరకు భర్తకు తెలియకుండా ఉంటుందా అని...)

"ఇంతకన్నా మరి నాకు సాగలేద్రా. మీ రెవరైనా ప్రొలాంగ్ చెయ్యండి!" అంటూ చేతిలో కాగితాల్ని పడేశాడు రాజా.

"నే చెప్పలే! చీదరికంలో రొమాన్సు రాయలేంరా! రొమాన్సేమిటీ, కథ కూడా చప్పగా ఉంటుంది. అయినా, నవల రాయబోయే అతనిలో ఎంత మూవ్‌మెంటు ఉండాలి! ఇంత కొంచెం రాసీ మరి రాయలేనంటావా?"

"పోనిద్దూ, నా చేతికియ్యి. వాటిన్నేను కంటిన్యూ చేస్తాను" అంటూ ఆ కాగితాల్ని తన చేతిలోకి తీసుకున్నాడు చిట్టి ...

* * *

చిట్టి చేతిలో కలం చకచకా సాగిపోతూంది ...

రాణీ దేవుడి విగ్రహం ముందు కూర్చుని 'పి. లీల' లా పక్కా కర్ణాటక బాణీలో ప్రార్థనా గీతం పాడుతూంది.

సంతోషం పెల్లుబికిన వదనంతో అడుగు పెట్టాడు రాజా.

"రాణీ! భగవంతుడు మనల్ని కరుణించాడు. నీ పూజలు ఫలించాయి. మన కష్టాలు తీరాయి. అప్పుడెప్పుడో లాటరీలో కట్టిన టికెట్టుకి లక్ష రూపాయలు వచ్చాయి."

మనస్ఫూర్తిగా దేవుడికి దండం పెట్టాడు.

"కమాన్, రాణీ! పెళ్ళైన తరవాత నీకు స్వర్గం చూపెడతానని, నందన వనంలో నడిపిస్తానని ఎన్నెన్ని బీరాలు పలికాను! అవన్నీ నిజం చేస్తాను. రేపే మన హనీమూన్!"



"ఏమిటీ? ఇలాటి పరిస్థితుల్లోనా?" ఆనందం, సంతోషం, భయం — అన్నీ మిళితమైన స్వరంతో అంది రాణీ.

"ఆఁ! ఈ నాటికి నువ్వొకర్తివే కతువుతో ఉన్నావా? ఏం పరవాలేదు. ఏయే ఊర్లు తిరిగొద్దాం చెప్పూ?" అన్నాడు రాజా ...

అంతవరకు వ్రాసిన చిట్టి ఆలోచనలో పడ్డాడు. మైసూర్, బృందావన్ గార్డెన్సు అని వర్ణిస్తే సినిమా తియ్యడానికి బాగుంటుంది. కాని, కథ చాలా నెరేటివ్‌గా వెళుతుంది. మరి తను ఆ ఊర్లు చూడలేదు కదా! హీరో హీరోయిన్ల చేత హనీమూన్ ఎలా చేయించడం?

కూపస్థ మండూకంలా ఈ వైజాగ్ చుట్టుపక్కల తప్ప ఇంకేమీ తెలియదే తనకి? ఎలా వ్రాయడం?

సిగరెట్టు వెలిగించాడు. సిగరెట్టు పొగ రింగుల్లా అతని మెదడులో కూడా ఆలోచనలు రాసాగాయి.

'ఆష్‌ట్రే'లో సిగరెట్టు పడేసి కథని కంటిన్యూ చేశాడు.

"డియర్! ఇప్పటికే మైసూర్, బృందావన్, ఇంకా ఇంకా చాలా చాలా తిరిగాం, నీకు ఇంకా ఓపిక ఉందా? లేక రిటర్న్ అయిపోదామా?" అన్నాడు రాజా.

"రాజా, నాకు విశాఖపట్నం వెళ్ళాలని ఉంది. నన్ను తీసుకెళ్తావా?" అంది ముద్దుముద్దుగా.

"ఇంత సింపుల్ కోరికా? హాయ్యో, పిచ్చి పిల్లా" అంటూ వైజాగ్ టికెట్లు కొన్నాడు.

హమ్మయ్య అంటూ నిట్టూర్చాడు చిట్టి. ఇంక యథేచ్ఛగా వీళ్ళ శృంగార యాత్రని ఈ ఊళ్లో వ్రాసుకోవచ్చు. అంతవరకు మైసూర్ బృందావన్ గార్డెన్సులో కుంటుతూ నడిచిన అతని కలం, నిమ్నోన్నతాలైనా వైజాగులో బరబర వరుగెట్టి సాగింది.

ముందు సింహాచలం దైవ దర్శనం చేసుకున్నారు రాజా రాణీలు. అక్కడున్న గార్డెన్స్ వైపు వెళ్ళారు.

బాట కిరువైపులా ఉన్న గులాబీల తోట వాళ్ల మనసుని ఆకట్టుకుంది. ఇంకా ఇంకా వెళ్ళారు.

ఒక పెద్ద పూల్. పూల్లో ఒక శ్రీకృష్ణుడు. అందులో మోకాలెత్తు నీళ్ళు. బురద బురదగా, మట్టిగా ఉన్నా, శ్రీకృష్ణుడి మొహంలో చిలిపితనం స్పష్టంగా కనబడుతున్నది. ఒకవిధంగా చూడానికి అసహ్యంగాను, ఒక విధంగా రమ్యంగాను ఉంది.

ఇంకొంచెం దూరం వెళ్లితే ఒక చిన్న మండపం. దాని వెనకాల వాటర్ వర్క్సులా నీరు ప్రవహిస్తున్నది. ఆ నీటినే అక్కడ తోటకి గమ్మత్తుగా సప్లై చేశారు.

"రాణీ! నిజంగా ఎంత ఆహ్లాదంగా ఉంది ఇక్కడ సీనరీ! మనం చూసిన ఆ బృందావన్ గార్డెన్సుని తలదన్నిన ట్టుంది. సరిఅయిన రక్షణ లేదుగాని, ఉంటే మరింత సుందరంగా ఇక్కడ ఎరేంజ్ చెయ్యొచ్చు కదూ?" అన్నాడు ...

"రాజా! మరీ ఘోరం, రాజా! ఈ రచయిత బృందావన్ గార్డెన్స్ లాటివి ఎంత చూడకుంటే మటుకు, ఈ సింహాచలం గార్డెన్సుని ఇంతలా వర్ణించేయడమేనా?"

"రాణీ! పోనీ ఆ విషయం అలా ఉండనీ! నీ కెలా ఉందో చెప్పు? కంపారటివ్‌గా కాదు — మామూలుగా చెప్పు. ఇక్కడ బాగుందా లేదా?" అన్నాడు రాజా.

"బాగుందిలే — కాదనలేదుగా? ఇంతకన్నా మంచి ప్రదేశాలు ఇక్కడ లేవా?"

"అంటే? సింహాచలం లోనా?"

"ఊహూ! వైజాగ్‌లో."

"ఓ ... రామకృష్ణా మిషన్, లాసన్స్ బే, ముడసర్లోవా, ఒకటేమిటి— ఈ రచయితకి తెలిసిందే వైజాగ్! ఎన్నిచోట్లకైనా మనల్ని తిప్పగలడు. కానీ, పాఠకలోకం ఎక్కడ బోరు ఫీలౌతుందేమో అని ఆలోచిస్తున్నాడు."

"ఏహా! మొగుడూ పెళ్లాలు ఇద్దరి మధ్య రావడానికి రచయితెవడూ? పాఠకు డెవడూ? లెట్ దెమ్ గో టు డాగ్స్!" అంటూ రెక్క పుచ్చుకుని మెట్లు దిగి పోయింది.

లాసన్స్ బే దగ్గరి కొచ్చేసరికి 'కులగోత్రాలు' సినిమాలో 'చెలికాడు నిన్నే రమ్మని పిలువ' పాట ఇద్దరికీ గుర్తుకొచ్చింది. ఆమె తను గర్భవతినని కూడా మరిచిపోయింది. ఒకటే పరుగులతో దొంగాట లాడుకొని లాసన్స్ బే దగ్గర నుండి రామకృష్ణా మిషన్ వరకు వచ్చేశారు.

"రాజా, నా కడుపులో ఏమిటోలా ఉంటూంది. ఇదీ కాక అదో 'ఇది' లా ఉంది. లాడ్జికి పోదామా?" అంది ఇబ్బందిగా.

వెంటనే టాక్సీ మాట్లాడుదామా అనుకున్నాడు రాజా. కాని, 'ఆర్కే మిషన్' దగ్గర టాక్సీలు ఉండవుగా? అంతలో వాళ్లకోసమేనా అన్నట్టుగా ఏదో నంబరు బస్సు వచ్చింది.

బస్సులో కూర్చుందుకు చోటు లేదు ఆమె అదోలా బాధపడిపోతూంది.

బస్సు సెంవరీ క్లబ్ దాటి అమెరికన్ హాస్పిటల్‌కి వచ్చింది.

"వుమెన్స్ హాస్టలు — అమెరికన్ ఆస్పత్రి — [illegible] — దిగండి" అన్న బస్సు కేకతో రాణీ అక్కడ దిగిపోయి ఆ ఆస్పత్రిలో జాయినయి పోతే బాగుండును అనుకుంది. కాని, బస్సులో ఆ కొస అతను. ఈ కొస తను. మరి కొంచెం ఓపిక పట్టింది.

ఆ బస్సు కె. జి. హెచ్. అప్ ఎక్కి, పద్మనివాస్ డౌన్ దిగేసరికి రాణి బొజ్జలో ఉన్న పిండం మరి ఉండలేనంది.

'కెవ్వ్' మని కేకవేసింది రాణి. బస్సు నాపేశారు. ఇప్పుడు ఎమర్జెన్సీ కేసన్నీ, 'కే. జీ. హెచ్.' లో జాయిన్ చేయించడం కన్నా ఎదురుగా ఉన్న శోభా క్లినిక్ లోనే జాయిన్ చేయించడం మంచిదని అక్కడే చేర్పించారు. ఆ ఆస్పత్రిలోనే రాణి గర్భం పోయింది. అస్సలేం ఖర్మ! పదో నంబర్ బస్సులోనే పోయింది. కొను మరి. పోయిందంటే పోదు మరి! అంత గతుకుల బాటలో గర్భం ఒక్కటే ఏమిటీ, ప్రాణాలైనా పోవచ్చు.

డాక్టరు మరీ మరీ చెప్పింది, చాలా సిన్సియర్‌గా రెస్టు తీసుకోవాలని.

"చూశావా, రాజా! ప్రెగ్నెంటుగా ప్రేమయాత్రేమిటే అంటే వినలేదు నువ్వు. కడుపూ లేదూ, కొడుకూ లేదూ, ఈ ఎడబాటు మనకు ... ఛీ ... ఛీ ..." అంటూ తన గదిలోకి వెళ్లిపోయింది రాణి.

బయట వెన్నెల పిండార పోస్తూంది. వాతావరణం చల్లగా ఉన్నా, అతని మనసు వేడిగా ఉంది. పక్కనున్న మల్లెలు, నైట్ క్వీన్‌లు మరింత మత్తెక్కిస్తున్నాయి ఆమె గదిలోకి అప్రయత్నంగా అడుగు పెట్టాడు.

అర్ధరాత్రి ఆమె తాగవలసిన మందు సీసా ఆమె పక్కనున్న స్టూల్ మీద అతన్ని వెక్కిరిస్తూ నిలిచి ఉంది— నా యజమానురాల్ని తాకవద్దు సుమీ అని హెచ్చరిస్తున్నట్టుగా ఉంది.


తన గదిలోకి వచ్చేశాడు రాజా. గుండెల్లో మంటలు పుడుతున్నాయి. పుడుతున్నాయంటే పుట్టవూ మరి? ఒకటా? రెండా? అయిదు — అయిదు పూల బాణాలు అలా అమరలోకం నుండి అమాంతం వచ్చి అతని గుండెల్లోకి దూసుకుపోతే మంటలేమిటి, దావానలాలే పుడతాయి.

మరా గదిలో ఉండలేపోయాడు రాజా.

ఆ ఊర్లో ఉండే ఆనందనిలయంలోకి అడుగు పెట్టాడు రాజా. అది ఆనందానికి నిలయం. పంచేంద్రియా లన్నింటికీ అన్ని విధాలుగా ఆనందాన్నియ్య గలిగిన ఆనందకాసారం.

ఆ నిలయంలో ఉన్న 'రోజీ' అతని కంటికి డాక్టర్లా కనిపించింది. గుండెల మీద ఆఘాటాలు కన్న తీవ్రంగా తగిలిన ఆ అయిదు బాణాల్ని జాగ్రత్తగా తీసింది. అతనికి చల్లని మందు పెట్టింది. తియ్యని మధురం చూపెట్టింది.

ఒక రోజా, రెండు రోజులా? మూడు నెలలుగా సాగుతున్న ఈ చర్య రాణీకి తెలియకుండా ఎలా ఉంటుంది?



శిల్పసుందరి (శ్రీరంగం)
ఫోటో—మధుకర్ (తిరుపతి)

బుజ్జి కొట్టుకుంది. బతిమాలుకుంది. చచ్చిపోతానని బెదిరించింది. "నా ఆరోగ్యం పాడైనా ఫరవాలేదు. నన్ను శిక్షించండి. కానీ, అసహ్యమైన వాళ్ల దగ్గరికి వెళ్లి మీ ఆరోగ్యం పాడుచేసుకోకండి" అని విలవిలా విలపించింది.

కొత్తనీరు వల్ల పాత నీరు కొట్టుకు పోతూంది.

రాజుకి ఇప్పుడు రోజీ తోనే లోకం.

ఒక రోజు ..

రోజీ ఒళ్లో తల పెట్టుకుని మందు సేవిస్తున్నాడు రాజు. ఆ సమయంలో ఓ వయసు మళ్లినాయన వచ్చాడు.

"అరె, బాబాయ్!" అని రోజీ, రాజా లిద్దరూ ఒకే సారి అన్నారు. అని ఇద్దరూ ఆశ్చర్యంగా ఒకళ్ల నొకళ్లు చూసుకున్నారు.

"ఈయన నీకు బాబాయా?" అని ఇద్దరూ ఇద్దర్నీ ఒకే సారి ప్రశ్నించుకున్నారు. దానికి సమాధానంగా ఆ వయసు మళ్లిన బాబాయి, సిగరెట్ పైప్ లోంచి పొగ వదులుతూ, పొగ రింగుల్లా గతాన్ని ముందుకు తెచ్చాడు.

అదో ఆస్పత్రి.

రాజా వాళ్లమ్మ నానా ప్రసవవేదనా పడుతూంది. రాజా చిన్నపిల్లవాడుగా కంగారు పడుతున్నాడు. రాజా వాళ్ల బాబాయీ, రాజా వాళ్ల నాన్న గారూ రన్నింగ్ రేస్‌లా పచార్లు చేస్తున్నారు.

కేర్‌మని బాల రోదనం — 'ఆడపిల్ల' అని నర్సు చెప్పడం జరిగింది.

అసలే వాళ్లు బీదవాళ్లు. అందులో ఒక ఎడిషనల్ మెంబరు — అందునా ఆడపిల్ల. ఆ పిల్ల నెలా వదుల్చుకోవడమా అని ఆలోచనలో పడ్డారు రాజా వాళ్ల నాన్నగారు. ఆ బాధ్యత కాస్తా తమ్ముడి పైన పెట్టారు.

రోజా బుగ్గలున్న పండంటి ఆ పాపని ఓ కంపెనీ యువతికి అమ్మాడు రాజా వాళ్ల బాబాయి. రక్త సంబంధమే కాకపోయినా, కాస్తా 'నాలుగు రాళ్ల' సంబంధం ఉండకపోతుందా అని ఆ బాబాయి మటుకు ఆ పిల్లతో తెగ తెంపులు చేసుకోలేకపోయాడు.

అదీ కథ.

"చెల్లీ!" అంటూ గావుకేకపెట్టాడు రాజా.

"అన్నయ్యా!" అంటూ ఓ అరుపు అరిచింది రోజీ. ఇద్దరూ ఒకరి నొకరు గాఢంగా పెనవేసుకుపోయారు.

"అన్నయ్యా! ఇన్నాళ్లూ ఈ కౌగిలి కెంత దూరం అయేను!"

"చెల్లెమ్మా! నీ అమూల్యమైన

